## అధ్యాయము 34

# షెకెము వద్ద యాకోబు మరియు అతని కుటుంబం

యాకోబు యొక్క కుటుంబం షెకెము వద్ద నివసించిన కాలంలో జరిగిన కొన్ని విషాద సంఘటనల గురించి అధ్యాయం–34 తెలియజేస్తోంది. పితరుని ఏకైక కుమార్తె అయిన దీనా బలాత్కారానికి గురైందని చెబ్తూ ఈ అధ్యాయం ప్రారంభమవుతుంది (34:1-7). బలాత్కరించిన వ్యక్తి ఆమెను తన భార్యగా స్వీకరించేలా ఆమె సోదరులు షెకెము మనుషులతో మోసపూరితమైన ఒప్పందం చేసుకోడానికి ఇది దారితీసింది (34:8-17). వీరి అవశ్యాభ్యర్థనకు షెకెమీయులు ఎటువంటి భేషజం లేకుండా సహజంగానే స్పందించినా (34:18-24), యాకోబు కుమారులు ఆ పట్టణంలోని మనుషుల్ని మూకుమ్మడిగా చిత్రవధ చేసి, తమ సోదరిని అవ మానపర్చినవారిపట్ల ప్రతీకారం తీర్చుకున్నారు.

### దీనా మానభంగం (34:1-7)

**[1]లేయా యాకోబునకు కనిన కుమార్తెయైన దీనా ఆ దేశపు కుమార్తెలను చూడ వెళ్లెను. [2]ఆ దేశము నేలిన హివ్వీయుడైన హమోరు కమారుడగు షెకెము ఆమెను చూచి ఆమెను పట్టుకొని ఆమెతో శయనించి ఆమెను అవమానపరచెను. [3]అతని మనస్సు యాకోబు కుమార్తెయైన దీనా మీదనే ఉండెను; అతడు ఆ చిన్న దాని ప్రేమించి ఆమెతో ప్రీతిగా మాటలాడి [4]ఆ చిన్నదాని నాకు పెండ్లిచేయుమని తన తండ్రియైన హమోరును అడిగెను. [5]తన కుమార్తెను అతడు చెరిపెనని యాకోబు విని, తన కుమారులు పశువులతో పొలములలో నుండినందున వారు వచ్చువరకు ఊరకుండెను. [6]షెకెము తండ్రియగు హమోరు యాకోబుతో మాటలాడుటకు అతనియొద్దకు వచ్చెను. [7]యాకోబు కుమారులు ఆ సంగతి విని పొలములో నుండి వచ్చిరి. అతడు యాకోబు కుమార్తెతో శయనించి ఇశ్రాయేలు జనములో అవమానకరమైన కార్యము చేసెను; అది చేయరాని పని గనుక ఆ మనుష్యులు సంతాపము పొందిరి, వారికి మిగుల కోపము వచ్చెను.**

**వచనము 1.** ఈ విషాద గాథలో ప్రముఖంగా కనిపించే షిమ్యోనుకు మరియు లేవికి తోడపుట్టిన సహోదరి **దీనా, యాకోబు** ప్రేమపొందని అతని భార్యయైన[1] **లేయా**కు పుట్టిన కుమార్తె (30:21). దీనా యాకోబుయొక్క ఏకైక కుమార్తె; ప్రతిరోజు తనతో ఉండేవారు తన పదకొండుగురు సోదరులే[2] అయినందువలన, బహుశా ఆమె ఆ పట్టణంలో ఉన్న యువతుల్ని కలుసుకోవాలని కోరుకొని (ఆశ పడి) ఉండవచ్చు. ఆమె **ఆ దేశపు కుమార్తె లను చూడ వెళ్లెను** అని ఉంది కాబట్టి,[3] ఈ సంఘటన జరిగే నాటికి బహుశా దీనా యుక్తవయస్కురాలై ఉండ వచ్చు. "చూడ వెళ్లెను" అనే అర్థాన్నిచ్చే (רָאָה, *ra'ah*) అనే హెబ్రీ పదం, షెకెము పట్టణంలోని కనానీయుల్లోని యువతుల అలవాట్లను పరిశీలించడంపట్ల దీనా ఆసక్తి కనపర్చి వారిని చూడడానికి వెళ్లిందనే భావాన్ని సూచిస్తోంది.[4]

దీనా కోరిక అమాయకంగానే కనిపించినప్పటికీ, యాకోబు లేయాలు తమ కుమార్తెకు తోడుగా ఎవరి నైనా పంపకుండా ఆమె తనకు తానుగా అపాయం కొనితెచ్చుకొనేలా అన్యపట్టణంలోకి వెళ్లేందుకు ఎందుకు అనుమతించారనేది పాఠకులకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అలా కాకపోయినా, తన సోదరులు గొర్రెల మందల్ని పశువుల మందల్ని పొలాల్లోనికి తోలుకొని వెళ్లినప్పుడు తన తల్లిదండ్రులకు తెలియకుండా ఆమె ఇంటి నుండి బయటికి వెళ్లి ఉండవచ్చు. పరిస్థితి ఏదైనప్పటికీ, ఆమె మూర్ఖపు చర్య ఆమెకు విషాదాంతాన్నే మిగిల్చింది (షెకెము పట్టణస్థులకు కూడా విషాదాన్నే మిగిల్చింది).

**వచనము 2.** విషాదఘట్టాన్ని వర్ణించడానికి రంగాన్ని సిద్ధంచేసిన తర్వాత, రచయిత **హివ్వీయుడైన హమోరు కమారుడగు షెకెము** గురించి తెలియజేస్తున్నాడు. క్రిందటి అధ్యాయం చివర్లో, యాకోబు ఒక పొలం కొన్నాడనే వర్ణనలో "షెకెము" గురించి "హమోరు" గురించి ప్రస్తావన కనబడుతోంది (33:18, 19). వీరు (షెకెము వాసులు) "హివ్వీయులు", కనాను దేశంలో నివాసం ఉంటున్న ఏడు జాతుల్లో హివ్వీయులు ఒకరు (10:15, 17; ద్వితీ. 7:1). హివ్వీయులు కనాను మధ్య ప్రాంతంలోని కొండసీమలో దక్షిణదిశలో యెరూషలేముకు సమీపంలో ఉన్న గిబియోను వరకు, ఉత్తరదశలో హమాతునకు పోవు మార్గము వరకు (యెహోషువ 9:1-7; 11:3; న్యాయాధి. 3:3) విస్తరించి నివసించారు. షెకెము పట్టణ వ్యవస్థాపకుడు హమోరు అనే విషయం స్పష్టంగానే తెలుస్తోంది (మరియు, న్యాయాధి. 9:28 చూడండి), ఈ పట్టణం పేరునే అతను తన కుమారుడికి పెట్టాడు.[5] వీరిద్దరి మధ్య ఉన్న "తండ్రి" "కుమారుడు" బంధుత్వం ఈ అధ్యాయంలో మళ్లీ మళ్లీ ప్రస్తావనకు వస్తూ, వీరు ఒకరి చర్యను మరొకరు సమర్థిస్తారనే వాస్తవాన్ని మరియు తమ స్వాస్థ్యంగా షెకెముమీద వీరికున్న అధికారాన్ని నొక్కి చెప్తోంది.

దీనా ఆ దేశంలోని యువతుల్ని "చూడ" (*ra'ah*) వెళ్లినప్పుడు, షెకెము **ఆమెను చూచి** (*ra'ah*) నట్టు తెలుస్తోంది. అతను మోహావేశంతో నిండినవాడై ఆమెను "పట్టుకొని" (לָקַח, *laqach*), లేదా "స్వాధీనం చేసుకొని" (NRSV) ఆమెతో

**శయనించి ఆమెను అవమానపర్చాడు.** "అవమానపర్చు" అనే అర్థాన్నిచ్చే עָנָה (*ʿanah*) అనే హెబ్రీ పదానికి "అణచివేయడం లేదా లోపరచుకోవడం" అని, లేక "లొంగిపోయేలా బలాత్కరించడం" అనే అర్థాలున్నాయి.[6] ఈ సందర్భంలో ఈ పదం అతను ఆమెను బలాత్కరించాడని, అంటే మానభంగం చేశాడని తెలియజేస్తోంది (CEV; NLT).[7] తోడులేకుండా వచ్చిన ఒంటరి యువతిని చూచి, కనానీయుల్లోని కొందరు యువతులు శీలవతులు కానట్లే, ఆమె కూడా శీలవతియైన యువతి కాదని అతను బహుశా తలంచి ఉండవచ్చు. తాను కోరుకున్న ఏ స్త్రీతోనైనా తన కామవాంఛల్ని తీర్చుకోడానికి, **ఆ దేశము నేలిన . . . యువరాజుగా** తనకు హక్కు ఉందని అతను ఆలోచించి ఉండవచ్చు.

**వచనము 3.** అమ్నోను తన సోదరియైన తామారును బలాత్కరించిన తర్వాత ఆమెను ద్వేషించినట్టుగా కాకుండా (2 సమూ. 13:15-19), షెకెము మనసు **దీనా మీదనే ఉండెను** అని తెలుస్తోంది. "మీదనే ఉండెను" అనే అర్థాన్నిచ్చే పదం, דָּבַק (*dabaq*) అనే హెబ్రీ క్రియావాచకపదం నుండి వ్యుత్పన్నమైన పదం, 2:24 వచనంలో పురుషుడు తన భార్యను "హత్తుకొనును" అనే అర్థాన్నివ్వడానికి ఈ క్రియాపదాన్నే ఉపయోగించడం జరిగింది. ESV బైబిల్, "అతని మనసు దీనాకు హత్తుకొని ఉంది" (నిమగ్నమై ఉంది, లేదా నిలిచి ఉంది) అని చెప్తోంది. **అతడు ఆ చిన్నదాని ప్రేమించి** (29:18) **ఆమెతో ప్రీతిగా మాటలాడి**నట్టు వాక్యభాగం తెలియజేస్తోంది. ఈ మాటలకు హెబ్రీలో అక్షరాలా, అతను ఆమె మనసుతో (లేక హృదయంతో) మాట్లాడాడని అర్థం. షెకెము దీనాను బలవంతంగా ఆక్రమించుకున్నాడు కాబట్టి, అతను ఆమెతో ప్రేమగా మాట్లాడడం బహుశా ఆమెకు ఓదార్పునివ్వడంకొరకు కావచ్చు (రూతు 2:13; యెషయా 40:2 చూడండి). ఇంకా సంభావ్యనీయమైనదేమిటంటే అతను ఆమెను తనతోనే ఉండమని ఆమెను బుజ్జగిస్తూ అనునయపూర్వ కంగా మాట్లాడుతున్నాడని ఈ మాటలు సూచిస్తున్నాయి[8] (మరియు, న్యాయాధి. 19:3 చూడండి; హోషేయ 2:14). వత్తిడి మేరకైనా గానీ, లేక తన ఇష్టప్రకారమైనా గానీ ఆమె అతని వద్దనే ఉన్నట్టు మనకు అర్థమవుతోంది; అయితే ఆమె అతని వద్దనే ఉన్నట్టు మనకు ఈ వర్ణన చివర్లోగానీ (34:26) సూచ్యార్థంగా తెలియదు.

**వచనము 4.** అతను దీనాను ప్రేమించాడు కాబట్టి, **ఆ చిన్నదాని నాకు పెండ్లిచేయుమని**[9] **తన తండ్రియైన హమోరును అడిగెను** అని తెలుస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు పెళ్లి చేయడం ఆచారంగా వస్తోంది కాబట్టి (21:21; 24:1-9; 38:6; న్యాయాధి. 14:2), అతను (షెకెము) ఈ విషయంలో తన తండ్రిని బ్రతిమిలాడి అడిగాడు. తదుపరి కాలంలో మోషే ధర్మశాస్త్రం, ఎవరైనా ఒక పురుషుడు ప్రధానం కానటువంటి కన్యను అందరికి తెలిసే విధంగా బలాత్కరించినట్లయితే, ఆ పురుషుడు ఆమె తండ్రికి ఏబై వెండి రూకలిచ్చి (ఏబై షెకెలు నాణేలు) ఆమెను వివాహం చేసుకొని, అతను ఆమెను అవమానపర్చినందుకుగాను ఆమెను ఎన్నటికీ విడిచిపెట్టకూడదని ఆదేశించింది

(ద్వితీ. 22:28, 29; మరియు, నిర్గమ. 22:16, 17 చూడండి).[10] అయితే అనేక వందల సంవత్సరాల పూర్వం కనానులో ఈ విధంగా ఓలి (కన్యాశుల్కం) ఇచ్చే ఆచారం లేనప్పటికీ, ఈ యువకుడు దీనాను వివాహం చేసుకోడానికి సిద్ధపడడంతోబాటు యాకోబుకు అతని కుమార్తె విషయంలో అతను అడిగినంత ఓలి నివ్వడానికి ముందుకు వచ్చాడు (34:11, 12).

**వచనము 5. యాకోబు**కు ఈ వార్త, అంటే **తన కుమార్తెను అతడు** (షెకెము) **చెరిపె**ననే వార్త ఎలా చేరిందో వాక్యభాగం తెలియజేయడం లేదు, అయితే ఇది వెంటనే అతనికి తెలిసినట్టు స్పష్టమవుతోంది. అయితే అతనిలో ఎటువంటి తీవ్రమైన ప్రతిచర్య కనబడలేదు; పైగా అతను **ఊరకుండెను**[11] అని వాక్యభాగం తెలియజేస్తోంది. ఇది తదుపరి కాలంలో దావీదు చూపిన స్పందనకు చాలా భిన్నంగా ఉంది; దావీదు తన కుమార్తె తామారుకు మానభంగం జరిగిన వార్త విని వెంటనే ఉగ్రుడయ్యాడు (2 సమూ. 13:21). యాకోబు తన భార్య లేయాకైనా తమ కుమార్తెకు జరిగిన అవమానం గురించి చెప్పినట్టు కనబడడం లేదు. ఈ విషయం గురించి యాకోబు విన్నప్పటికీ అతను ప్రదర్శించిన మౌనం, అతను తన కుమార్తెయొక్క గౌరవం విషయంలో ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాడని అతణ్ణే ఆక్షేపిస్తున్నట్టుగా కనబడుతోంది. **తన కుమారులు పశువులతో పొలములలో నుండినందున వారు వచ్చువరకు ఊరకుండెను** అని యాకోబు గురించి ఈ వాక్య భాగం తెలియజేస్తోంది.

**వచనము 6.** షెకెము కోరుకున్న ప్రకారం, **హమోరు** పట్టణశివారుల్లో నివాసమున్న **యాకోబుతో మాటలాడుటకు అతనియొద్దకు వచ్చెను** అని తెలుస్తోంది. “వచ్చెను” (יָצָא, *yatsa’*) అనే క్రియావాచక పదం 34:1 వచనంలో “ఆ దేశపు కుమార్తెలను చూడ వెళ్లెను” దీనా గురించి తెలియజేసే సందర్భంలో కనబడుతుంది. దీనా యాకోబు నివాసప్రాంతాన్ని విడిచి హమోరు నివసించే ప్రాంతాన్ని చూడ వెళ్లడం, హమోరు తన నివాస పట్టణాన్ని విడిచి యాకోబు నివాస ప్రాంతానికి రావడానికి దారి తీసింది. తన కుమారుడు చేసిన అవమానపు చర్య వలన కనానీయుడైన ఈ తండ్రికి (హమోరు) క్లిష్టపరిస్థితి ఎదురైంది. అతను పితరుడితో ఏం చెప్పాడు?

**వచనము 7.** అప్పుడే పొలంనుండి వస్తున్న **యాకోబు కుమారులు** కథలోకి ప్రవేశించారు. షెకెము తమ సోదరిపట్ల చేసినదాని గురించి వారెలా తెలుసుకున్నారనేదానిగురించి వాక్యభాగం దేన్నీ సూచించడం లేదు. ఏదేమైనా, జరిగినదాని గురించి వారు తెలుసుకున్నప్పుడు వారి ప్రతిచర్య తమ తండ్రి చూపిన ఉదాసీన వైఖరికి చాలా భిన్నంగా ఉంది (34:5). **అతడు** (షెకెము) **యాకోబు కుమార్తెతో శయనించి ఇశ్రాయేలు జనములో అవమానకరమైన కార్యము చేసెను . . . గనుక ఆ మనుష్యులు సంతాపము పొందిరి** అనీ, **వారికి మిగుల కోపము వచ్చెను** అనీ వాక్యభాగం తెలియజేస్తోంది.

ఈ సంఘటనకు కొన్ని వందల సంవత్సరాల తర్వాతనే ఇశ్రాయేలు ఒక

జాతిగా ఆవిర్భవించింది గనక, “ఇశ్రాయేలు జనములో అవమానకరమైన కార్యము చేసెను” అనే ప్రకటన అనంతర కాలంలో ప్రేరణ పొందిన లేఖరి ఎవరైనా మధ్యలో దీన్ని ప్రక్షిప్తపరచి (పొందుపరచి) ఉండవచ్చు. ఏదేమైనా, “ఇశ్రాయేలు జనములో” అనే ప్రస్తావన తదుపరి కాలంలో యాకోబునుండి ఉద్భవింపబోయే ఇశ్రాయేలు జాతికి మూలమైన అప్పటి యాకోబు వంశాన్ని సూచిస్తుందని కొందరి అభిప్రాయం. ఈ వాక్యభాగం గురించి, “అతడు ఇశ్రాయేలు జనముపట్ల (యెడల, లేక ఎదుట) అవమానకరమైన కార్యము చేసెను” అని మరో వివరణాత్మక పఠనం కూడా ఉంది, ఎందుకంటే “లో” (בְּ, $b^e$) అనే ప్రత్యయం “పట్ల, యెడల, ఎదుట అనే అర్థాల్ని కూడా ఇస్తుంది. అర్థవంతమైన మరో పఠనం: “అతను ఇశ్రాయేలు (యాకోబు) జనము యెడల అవమానకరమైన కార్యము చేసెను.”[12] ఏదేమైనా, ఇశ్రాయేలులో జరిగిన అవమానకరమైన చర్యల్ని వర్ణించడానికి కూడా పాత నిబంధనలో ఇటువంటి పదాల్నే ఉపయోగించడం జరిగింది (ద్వితీ. 22:21; యెహోషువ 7:15; న్యాయాధి. 20:6, 10; 2 సమూ. 13:12; యిర్మీయా 29:23). వీటిలో ఏ అభిప్రాయం సరైనది అనేదాన్ని ప్రక్కన పెడితే, దేవుని ప్రజల్లో ఇటువంటిది **చేయరాని పని** అని 34:7 వచనం నొక్కి చెబ్తోంది.

## యాకోబు కుమారులు షెకెము మనుష్యుల్ని దబాయించి కోరిన కోరికలు (34:8-17)

### షెకెము ఇవ్వచూపినవి (34:8-12)

**[8]అప్పుడు హమోరు వారితో – షెకెము అను నా కుమారుని మనస్సు మీ కుమార్తె మీదనే ఉన్నది; దయచేసి ఆమెను అతనికిచ్చి పెండ్లిచేయుడి. [9]మీ పిల్లలను మాకిచ్చి మా పిల్లలను మీరు పుచ్చుకొని మాతో వియ్యమంది మా మధ్య నివసించుడి. [10]ఈ దేశము మీ యెదుట ఉన్నది; ఇందులో మీరు నివసించి వ్యాపారముచేసి ఆస్తి సంపాదించుకొనుడని చెప్పెను. [11]మరియు షెకెము – మీ కటాక్షము నా మీద రానీయుడి; మీరేమి అడుగుదురో అది యిచ్చెదను. [12]ఓలియు కట్నమును ఎంతైనను అడుగుడి; మీరు అడిగి నంత యిచ్చెదను; మీరు ఆ చిన్నదాని నాకు ఇయ్యుడని ఆమె తండ్రితోను ఆమె సహోదరులతోను చెప్పెను.**

**వచనము 8.** యాకోబుతోను అతని కుమారులతోను **హమోరు** మర్యాదపూర్వకంగానే మాట్లాడాడు; అయితే అతను ఎటువంటి క్షమాపణలు గానీ, లేక షెకెము దీనాపట్ల జరిగించినదానిగురించి గానీ చెప్పలేదని తెలుస్తోంది. పైగా, పట్టణంలో ఉన్న తన కుమారుని ఇంట్లో ఆ యువతి ఇంకా ఎందుకు ఉందనే విషయం గురించి ఎటువంటి ప్రస్తావన చేయలేదు (34:26). బదులుగా అతను,

**షెకెము అను నా కుమారుని మనస్సు మీ కుమార్తె మీదనే ఉన్నది; దయచేసి ఆమెను అతనికిచ్చి పెండ్లిచేయుడి** అని చెప్పాడు. “మనస్సు” (హృదయం) అనే అర్థాన్నిచ్చే (נֶפֶשׁ, *nepesh*) అనే పదానికి “ప్రాణం లేక జీవం” అనీ, “కోరిక లేక ఇచ్ఛ” అనీ “గాఢావేశం లేక తీవ్రోద్రేకం” అనీ బహుళార్థాలున్నాయి. “మీదనే ఉన్నది” חָשַׁק (*chashaq*) అనే పదానికి “హత్తుకొని ఉండు” లేక “ప్రేమించు” అనే అర్థాలున్నాయి. ద్వితీ. 21:11 వచనంలో ఈ పదానికే “మోహించి” అనే అనువాదం కనబడుతుంది; అంటే ఒక పురుషుడికి భార్యపట్ల ఉండే మోహావేశాన్ని ఈ పదం సూచిస్తుంది. బైబిల్లోని ఇతర ప్రస్తావనల్లో ఈ పదం, ఇశ్రాయేలీయులపట్ల యెహోవా యొక్క ప్రేమను (“ప్రేమించి” – ద్వితీ. 7:7; 10:15), ఒక వ్యక్తికి యెహోవాపట్ల ఉన్న ప్రేమను (“ప్రేమించుచున్నాడు” – కీర్తనలు 91:14) సూచిస్తోంది. కొన్ని ఆంగ్ల బైబిల్ ప్రతులు 34:8 వచనాన్ని సమకాలీన భావంలో ఈ విధంగా వ్యక్తం చేస్తున్నాయి: దీనా మీద షెకెము *హృదయం నిలిచి ఉంది* (NIV), అతను ఆమెను *మనసారా ప్రేమించాడు* (NLT). ఇటువంటి భావాన్నిచ్చే పదాల్నే ఉపయోగిస్తూ, షెకెము ఆమెను పెళ్లి చేసుకోవాలని కోరుకుంటున్నట్లు, తన కుమారుడికి దీనాకు మధ్య ఉన్న సంబంధం ఇరుపక్షాల మధ్య వియ్యంగా మారేందుకు పితరుణ్ణి అతని కుమారుల్నిఒప్పించడానికి హమోరు ప్రయత్నించాడు.

**వచనము 9.** దీనాను పెళ్లిచేసుకొని ఆమెను భార్యగా స్వీకరించాలనే తన కుమారుని పట్టుదలను హమోరు నొక్కి చెబ్తూ, షెకెము ప్రజలకు యాకోబు కుటుంబానికి మధ్య ఒక ఒప్పందాన్ని ప్రతిపాదిస్తున్నాడు. అతను, **మీ పిల్లలను మాకిచ్చి మా పిల్లలను మీరు పుచ్చుకొని మాతో వియ్యమంది** అని చెబ్తున్నాడు. ఇది ఉదారతతో చేసిన ప్రతిపాదనలాగా కన్పిస్తున్నప్పటికీ, అబ్రాహాము ఇటువంటి వియ్యాన్ని నిషేధించాడు; అబ్రాహాము తన కుమారునికి కనానీయుల్లోని యువతిని భార్యగా చేయకూడదని తన దాసుడిచేత ప్రమాణం చేయించుకున్నాడు. బదులుగా, తన బంధువర్గమైన అరామీయుల్లోని యువతిని ఇస్సాకుకు వధువుగా తీసుకొని రమ్మని అబ్రాహాము ఆ దాసుణ్ణి హారానుకు పంపించాడు (24:3, 4). ఇస్సాకు రిబ్కాలు కూడా ఏశావు కనానీయుల్లోని యువతుల్ని భార్యలుగా చేసుకోడంపట్ల తీవ్రమైన అభ్యంతరం వెలిబుచ్చారు; ఏశావు భార్యలు ఇస్సాకు రిబ్కాలకు తీవ్రమైన మనోవేదన కలిగించారు. యాకోబు తన మేనమామ కుటుంబంనుండి భార్యను స్వీకరించడం కూడా వీరు అతణ్ణి హారానుకు పంపివేయడానికి ఒక కారణం (26:34, 35; 27:46; 28:1, 2). ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశంలోకి ప్రవేశించబోయేముందు, దేవుడు వారికిచ్చిన ముఖ్యమైన విధి వారు కనానీయుల్ని పెళ్లిచేసుకొని వారితో వియ్యం అందుకోకూడదు (ద్వితీ. 7:3, 4). యెహోషువ మరణించే ముందు, కనానీయులలో పెళ్లి సంబంధాలు ఎటువంటి పతనానికి వినాశనానికి దారితీస్తాయో గట్టిగా హెచ్చరించాడు (యెహోషువ 23:11-13). అందుచేత, కనానీయులతో వియ్యం అందుకొనేలాగా మాట్లాడిన హమోరు

ప్రతిపాదనకు వ్యతిరేకంగా యాకోబు స్పందించకపోవడం నిజంగా వింతగానే కనబడుతోంది.

**వచనము 10.** హమోరు తన కుమారుడి పెళ్లి ప్రతిపాదన యాకోబుకు అతని కుటుంబానికి (వంశానికి) సామాజిక మరియు ఆర్థిక ప్రయోజనాల్ని చేకూరుస్తుందని చెప్పాడు: (1) వీరు (యాకోబు కుటుంబీకులు) అక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని షెకెము ప్రజల మధ్య శాంతియుతంగా జీవించడం. (2) **ఈ దేశము మీ యెదుట ఉన్నది** అనడంలో పచ్చికబయళ్లు విస్తారంగా ఉన్న ఆ ప్రదేశం యాకోబు గొర్రెల మందలకు పశువుల మందలకు అనుకూలంగా ఉండడంతోబాటు, వీరు ఆ దేశంలో ఎక్కడైనా నివసించే వీలు ఉండడం. (3) ఈ దేశంలో వీరు **నివసించి వ్యాపారముచేసి ఆస్తి సంపాదించు**కొనవచ్చు.[13] హమోరు దూర దృష్టి ఏమిటంటే పరదేశులైన యాకోబు వంశస్థుల్ని తమ కనాను సమాజంలోకి సమ్మిళితం చేసుకోడం. గతంలో లోతు అతని కుటుంబం సొదొమ సమాజంలో దాదాపుగా కలిసిపోతున్న సందర్భంలో వారికెటువంటి దురవస్థ ఎదురైందో (19:1-38), ఇప్పుడు యాకోబుకు అతని కుటుంబానికి కూడా అటువంటి దురవస్థ ఎదురుకావచ్చు.

**వచనములు 11, 12.** హమోరు యాకోబును దర్శించినప్పుడు షెకెము కూడా తన తండ్రి వెంట ఉన్నాడని వాక్యభాగం తెలియజేస్తోంది (34:6 చూడండి). హమోరు మాట్లాడడం ముగించిన తర్వాత, అతని కుమారుడు **ఆమె** (దీనా) **తండ్రితోను ఆమె సహోదరులతోను** ఇతర విషయాల గురించి మాట్లాడాడు. సాధారణమైన పరిస్థితుల్లో, కనానులో ఉన్న పరదేశులకు ఇది ఉదారతతో నిండిన గొప్ప వరంలాగా కనబడుతుంది. షెకెము తనమీద **కటాక్షము** (חֵן, *chen*, "grace" "కృప") చూపమని వారిని ప్రాధేయపడుతున్నాడు; ఇది అతను దీనాను బలాత్కరించినందుకు క్షమాపణ చెబుతున్నట్టుగా కనబడుతోంది. తర్వాత అతను ఆ యువతి కొరకు ఓలి ఎంతో అడుగుతున్నాడు; ఆమె తండ్రి ఆమె సహోదరులు ఎంత **ఓలి** (מֹהַר, *mohar*[14]) అడిగినా ఎంత **కట్నము** (מַתָּן, *maththan*[15]) అడిగినా వారు అడిగినంత **యిచ్చెదను** అని చెబ్తూ **ఆ చిన్నదాని** తనకు **ఇయ్యుడని** విజ్ఞప్తి చేస్తున్నాడు.

## సహోదరుల ప్రతిపాదన (34:13-17)

**[13]అయితే తమ సహోదరియైన దీనాను అతడు చెరిపినందున యాకోబు కుమారులు షెకెముతోను అతని తండ్రియైన హమోరుతోను కపటముగా ఉత్తరమిచ్చి అనినదేమనగా [14]–మేము ఈ కార్యము చేయ లేము, సున్నతి చేయించుకొననివానికి మా సహోదరిని ఇయ్యలేము, అది మాకు అవమానమగును [15]మీలో ప్రతి పురుషుడు సున్నతి పొంది మావలె నుండినయెడల సరి; [16]ఆ పక్షమందు మీ మాట కొప్పుకొని, మా పిల్లలను మీకిచ్చి మీ పిల్లలను మేము**

**పుచ్చుకొని మీ మధ్య నివసించెదము, అప్పుడు మనము ఏకజన మగుదుము. [17]మీరు మా మాట విని సున్నతి పొందనియెడల మా పిల్లను తీసుకొని పోవుదుమని చెప్పగా**

**వచనము 13.** షెకెము దీనాను పెళ్లిచేసుకోడానికి భావావేశపూరితమైన ప్రతిపాదన చేశాడు; అయితే ఈ వ్యవహారంలో ఆ యువకునితో మాట్లాడడానికి బదులు, యాకోబు మౌనంగా ఉన్నాడు. **తమ సహోదరి యైన దీనాను అతడు చెరిపినందున**, యాకోబు **కుమారులు షెకెముతోను అతని తండ్రియైన హమోరుతోను కపటముగా ఉత్తర**మిచ్చారు. ఈ విషయంలో యాకోబు కుమారులు ఈ నిర్ణయానికెలా వచ్చారో రచయిత తెలియజేయలేదు. వీరు తమ తండ్రిని సంప్రతించకుండానే ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చి ఉండవచ్చని స్పష్టమవుతోంది; ఎందుకంటే తర్వాత వారి తండ్రి వారిని వంచన హత్య పట్టణంమీద దాడి విషయంలో నిందించాడు (34:30; 49:5-7). ఏదేమైనా, యాకోబు అత్యంత కీలకమైన సందర్భంలో సమర్థించరానంతగా ఉదాసీన వైఖరిని మౌనాన్ని ప్రదర్శించాడు. ఒక తండ్రిగా తన కుమారులకు జ్ఞానయుక్తమైన సలహాలిచ్చి వ్యక్తిగత పలుకుబడి నుపయోగిస్తూ మాట్లాడడానికి బదులు, తండ్రిగా తన బాధ్యతను ఉద్రేకపూరితులైన యువకులకు (తన కుమారులకు) వదిలిపెట్టాడు.

**వచనాలు 14-17.** యాకోబు కుమారులు తమ సోదరిని ఈ హివ్వీయుడికిచ్చి పెళ్లిచేసే విషయంలో షెకెముకు హమోరుకు ఇచ్చిన ప్రత్యుత్తరం యథార్థంగానే ఉన్నట్టు పైకి కనబడుతుంది. అయినా, వారు తమ **సహోదరిని** షెకెముకు భార్యగా ఇవ్వడానికి ఒక అభ్యంతరం, అతను **సున్నతి చేయించుకొననివాడు** కాబట్టి ఇది తమకు **అవమానమగును** అని చెప్పారు (34:14). వీరితో కలిసిపోవాలంటే, షెకెమీయుల్లోని **ప్రతి పురుషుడు సున్నతి పొంది**, తమ**వలె నుండినయెడల సరి** అనే షరతు విధించారు (34:15); ఈ విధంగా జరిగిన పక్షంలో, **మా పిల్లలను మీకిచ్చి మీ పిల్లలను మేము పుచ్చుకొని** అందరూ కలిసిపోయి **ఏకజనమగుదుము** అని చెప్పారు (34:16). "పిల్లలను" (కుమార్తెలు) అనే పదజాలం 34:9 వచనంలో హమోరు ఉపయోగించిన పదజాలాన్నే సూచిస్తోంది.

వారి నిర్ణయం నేర్పుగా ఉన్నా సూటిగానే ఉంది; ఇక దీనికి తిరుగులేదు. షెకెమువాసులు **సున్నతి పొందనియెడల**, ఆ సహోదరులు **మా పిల్లను తీసుకొని** [*laqach*] **పోవుదుము** అని చెప్పారు (34:17). యాకోబు కుమారులు దీనా గురించి "మా పిల్ల" అని ఎందుకు మాట్లాడారు? ఆమెకు పెద్ద అన్నలుగా, తమకు ఆమెను సంరక్షించే బాధ్యత ఉందని, అంటే తండ్రికున్న బాధ్యత తమకు కూడా ఉందనే భావంతో మాట్లాడి ఉండవచ్చు.

వీరు వర్ణించిన సున్నతికి, దేవుడు అబ్రాహాముకు అతని వంశస్థులకు విధించిన సున్నతి నిబంధనకు (17:9-14) సంబంధం కనబడడం లేదు. యెహోవాకు ఆయన ప్రజలకు మధ్య శాశ్వతమైన సూచనగా దేవుడు సున్నతిని

ఆదేశించాడు. అయితే, యాకోబు కుమారులు హివ్వీయుల్ని వారి కనాను దైవాల్ని వారి మతపరమైన ఆచారాల్ని విడిచిపెట్టి, యెహోవాను అనుసరించి తమ జీవితాల్లో ఆయన సంకల్పాన్ని (చిత్తాన్ని, ఉద్దేశాల్ని) అంగీకరించాలని కోరలేదు. హివ్వీయులు సున్నతి పొందాలని యాకోబు కుమారులు కోరుకోడం ఒక తెగకు చెందిన ప్రజల్లో వివాహ సంబంధాలు మరియు సామాజిక కట్టుబాట్లు వంటి విషయాల్లో ప్రత్యేకమైన ఆచారంగా వస్తున్నదాన్నే చాలా మటుకు సూచిస్తోంది గానీ, మతం విషయంలో వారి నమ్మకాల్ని ఆటంకపర్చబోదని తెలుస్తోంది.

## షెకెము వాసులు ఎటువంటి ఆలోచనల్లేకుండా ఒప్పుకోడం

## (34:18-24)

**18వారి మాటలు హమోరుకును హమోరు కుమారుడైన షెకెమునకును ఇష్టముగా నుండెను. 19ఆ చిన్నవాడు యాకోబు కుమార్తెయందు ప్రీతిగలవాడు గనుక అతడు ఆ కార్యము చేయుటకు తడవుచేయలేదు. అతడు తన తండ్రి యింటివారందరిలో ఘనుడు. 20హమోరును అతని కుమారుడైన షెకెమును తమ ఊరి గవిని యొద్దకు వచ్చి తమ ఊరి జనులతో మాటలాడుచు 21–ఈ మనుష్యులు మనతో సమాధానముగా నున్నారు గనుక వారిని ఈ దేశమందు ఉండనిచ్చి యిందులో వ్యాపారము చేయనియ్యుడి; ఈ భూమి వారికిని చాలినంత విశాలమైయున్నది గదా, మనము వారి పిల్లలను పెండ్లి చేసికొని మన పిల్లలను వారికి ఇత్తము. 22అయితే ఒకటి, ఆ మనుష్యులు సున్నతిపొందునట్లు మనలో ప్రతి పురుషుడు సున్నతి పొందినయెడలనే మన మాటకు వారు ఒప్పుకొని మనలో నివసించి యేకజనముగా నుందురు. 23వారి మందలు వారి ఆస్తి వారి పశువులన్నియు మనవగును గదా; ఎట్లయినను మనము వారి మాటకు ఒప్పుకొందము, అప్పుడు వారు మనలో నివసించెదరనగా 24హమోరును అతని కుమారుడగు షెకెమును చెప్పిన మాట అతని ఊరి గవిని ద్వారా వెళ్లువారందరు వినిరి. అప్పుడతని ఊరి గవిని ద్వారా వెళ్లువారిలో ప్రతి పురుషుడు సున్నతి పొందెను.**

**వచనము 18.** కారణాలు వేర్వేరుగా ఉన్నా గానీ, యాకోబు కుమారుల మాటలు **హమోరుకును . . . షెకెమునకును ఇష్టముగా నుండెను** అని తెలుస్తోంది. దీనా తనకు భార్యగా రావాలని షెకెము కోరుకోగా, యాకోబు కుటుంబంతో సంబంధం కలుపుకొనే విషయంలో హమోరుకు ఆర్థిక కారణాలున్నాయి. వాస్తవానికి, అతను (హమోరు) యాకోబును అతని కుమారుల్ని మోసగించి, చివరకు వారి మందల్ని ఆస్తుల్ని కాజేయాలనే ఆలోచనలో ఉన్నాడు (34:23).

**వచనము 19.** షెకెమును ఇక్కడ **చిన్నవాడు** (נַעַר, *na'ar*) అని సూచించడం

జరిగింది; దీనాకు ఉపయోగించిన పదాల్లో ఒక పదంతో (נַעֲרָה, *na'arah*) ఇది సమానంగా కనబడుతోంది. "చిన్నది లేక చిన్నదాని" అనే అర్థాన్నిచ్చేట్టుగా "girl" అని NASBలోను, "young woman" అని ESVలోను ఈ పదం యొక్క అనువాదం కనబడుతుంది (34:3, 12). ఇక్కడ "చిన్నదాని"ని తన భార్యగా "చిన్నవాడు" చేసుకోవాలనుకుంటున్నాడు.

అత్యాకాంక్ష కలిగిన "చిన్నవాడు"గా, షెకెము **యాకోబు కుమార్తెయందు ప్రీతిగలవాడు గనుక అతడు ఆ కార్యము చేయుటకు తడవుచేయలేదు** అని తెలుస్తోంది. అతను ఏ "కార్యము" (דָּבָר, *dabar*) చేశాడు? 34:18 వచనంలో "మాటలు" అనే అర్థాన్నిచ్చే హెబ్రీ పదాన్నే ఇక్కడ ఉపయోగించడం జరిగింది; అయితే ఈ పదం ఇంతకు ముందు (34:18లో) బహువచనంలో కనబడుతుంది. నిశ్చయంగా, షెకెము చర్య యాకోబు కుమారులు పెట్టిన షరతులకు సంబంధించినదే (34:13-17). ఆ తర్వాత జరిగిన సంఘటన ఈ విధంగా ఉండవచ్చు: అతను పట్టణపు గవిని (ద్వారం) దగ్గరకు వెళ్లి పురుషుల్ని సున్నతి చేయించుకొనమని అభ్యర్థించాడు (34:20-24). మరో సంభావ్యత, ఇది అతను పురద్వారం దగ్గరికి వెళ్లక మునుపే సున్నతి పొంది ఉండవచ్చని సూచిస్తోంది.

వర్ణనలో ఇక్కడ రచయిత షెకెముగురించి మరో విషయాన్ని ప్రక్షిప్తపర్చాడు: **అతడు తన తండ్రి యింటివారందరిలో ఘనుడు.** ఈ వ్యాఖ్య, ఆ పట్టణంలోను మనుషులు (లేదా, పురుషులు) ఎందుకు అతని మాట విని అతని సలహా ననుసరించాలో వివరిస్తోంది.

**వచనము 20.** ఆ పట్టణాన్ని పరిపాలించే **హమోరు**, మరియు **అతని కుమారుడైన షెకెమును తమ ఊరి గవిని యొద్దకు వచ్చి** (19:1; 23:10 చూడండి), క్రొత్తగా వచ్చిన పరదేశులు తమతో చెప్పిన ప్రతిపాదన గురించి **తమ ఊరి జనులతో** మాట్లాడారు. వీరు మాట్లాడిన మనుషులు ప్రాచీన పట్టణాల్లో పౌరజీవనానికి సంబంధించిన సమావేశాల్లో పలుకుబడి ఉన్న భూస్వాములైన ప్రముఖులు కావచ్చు. క్రీస్తు పూర్వం రెండు వేల సంవత్సరాల నాటి మెసొపొతమియ మరియు కనాను సాహిత్యాల్లో వీరి ప్రస్తావన కనబడుతుంది. బహుశా ఈ షెకెమీయులు కేవలం ఊరి పెద్దలే (ఊరి జనులు) కాక, పరదేశులకు భూకేటాయింపుల విషయంలోను, పరదేశుల్ని హివ్వీయుల ప్రాంతంలోకి అనుమతించే విషయంలోను, ఇతరులకు తమ ప్రాంతంలో పశువుల మందల్ని గొర్రెల మందల్ని మేపుకొనే అనుమతినిచ్చే విషయంలోను హక్కులు అధికారాలున్న బృందం కూడా కావచ్చు.[16]

**వచనము 21.** పరదేశులు తమతో **సమాధానముగా నున్నారు** అని ఈ ఇద్దరూ నొక్కి చెబుతున్నారు. హివ్వీయులు యాకోబు మనుషుల్ని **దేశమందు ఉండనిచ్చి** వారిని **వ్యాపారము** చేసుకొనేలా అనుమతించాలని, ఎందుకంటే **ఈ భూమి వారికిని చాలినంత విశాలమైయున్నది** అని చెబుతూ వీరిద్దరూ సిఫారసు చేస్తున్నారు. ఇంకా, **మనము వారి పిల్లలను పెండ్లి చేసికొని మన పిల్లలను వారికి**

**ఇత్తము** అని చెబుతున్నారు.

**వచనము 22.** తర్వాత హమోరు షెకెములు **ఆ మనుష్యులు** తమతో చెప్పిన షరతు **ఒకటి** గురించి తెలియజేశారు. **ఆ మనుష్యులు సున్నతిపొందునట్లు**, వారిలో **ప్రతి పురుషుడు సున్నతి పొందినయెడల** యాకోబు కుటుంబికులు **ఒప్పుకొని** వారి మధ్య **నివసించి** ఉండడం జరుగుతుందని వీరిద్దరూ చెప్పారు. అయితే వీరు తమ మాటల్లో ఉద్దేశపూర్వకంగా విస్మరించిన విషయం ఒకటుంది: షెకెము దీనాను బలాత్కరించాడని, ఆమె తండ్రి ఒక పెద్ద కుటుంబానికి యజమాని అని వీరు చెప్పలేదు, మరియు షెకెమీయులు సున్నతికి ఒప్పుకొంటేనే ఆమెను షెకెముకు ఇచ్చి పెళ్లిచేయగలమనే షరతు పెట్టారని వీరు ఊరి ప్రముఖులకు సూటిగా చెప్పలేదు.

**వచనము 23.** షెకెమీయుల్ని సున్నతికి ఒప్పించే ప్రయత్నంలో, హమోరు షెకెములు వారివలన తమ పట్టణానికి కలిగే ఆర్థిక ప్రయోజనాల్ని ఎత్తి చూపించారు. యాకోబుతోను అతని మనుషులతోను కలిసి ఉండడానికున్న కారణం గురించి, **వారి మందలు వారి ఆస్తి వారి పశువులన్నియు మనవగును గదా; ఎట్లయి నను మనము వారి మాటకు ఒప్పుకొందము, అప్పుడు వారు మనలో నివసించెదరు** అని చెప్పారు.

**వచనము 24.** పరదేశులు చేసిన ప్రతిపాదనను, **ఊరి గవిని ద్వారా వెళ్లువారందరు** తమ కనుకూలంగా ఉందనుకొనేలా వాళ్ళి **హమోరును అతని కుమారుడగు షెకెమును** చెప్పారు. బహుశా ఇది (ఊరి గవిని ద్వారా వెళ్లువారందరు) యుద్ధంచేసి పట్టణాన్ని రక్షించగల సమర్థుల్ని సూచించే నుడికారం అయ్యుండ వచ్చు.[17] ఈ మనుషులందరూ వారి మాట **వినిరి**, మరియు **ప్రతి పురుషుడు సున్నతి పొందెను** అని తెలుస్తోంది. ఈ శస్త్రక్రియ వలన పురుషులందరూ తాత్కాలికంగా అశక్తులై పట్టణాన్ని కాపాడలేకపోయారు.

## షెకెములోని పురుషుల్ని మూకుమ్మడిగా హత్యచేయడం

## (34:25-31)

**[25]మూడవ దినమున వారు బాధపడుచుండగా యాకోబు కుమారులలో ఇద్దరు, అనగా దీనా సహో దరులైన షిమ్యోనును లేవియు, తమ కత్తులు చేతపట్టుకొని యెవరికి తెలియకుండ ఆ ఊరిమీద పడి ప్రతి పురుషుని చంపిరి. [26]వారు హమోరును అతని కుమారుడైన షెకెమును కత్తివాత చంపి షెకెము ఇంట నుండి దీనాను తీసికొని వెళ్లిపోయిరి. [27]తమ సహోదరిని చెరిపినందున యాకోబు కుమారులు, చంపబడిన వారు ఉన్న చోటికి వచ్చి ఆ ఊరు దోచుకొని [28]వారి గొఱ్ఱెలను పశువులను గాడిదలను ఊరిలోనిదేమి పొలములోనిదేమి [29]వారి ధనము యావత్తును తీసికొని, వారి పిల్లలనందరిని వారి స్త్రీలను చెరపట్టి, యిండ్ల**

**లోనున్నదంతయు దోచుకొనిరి. [30]అప్పుడు యాకోబు షిమ్యోనును లేవిని చూచి – మీరు నన్ను బాధపెట్టి ఈ దేశనివాసులైన కనానీయులలోను పెరిజ్జీయులలోను అసహ్యునిగా చేసితిరి; నా జనసంఖ్య కొంచెమే; వారు నా మీదికి గుంపుగా వచ్చి నన్ను చంపెదరు; నేనును నా యింటివారును నాశనమగుదుమని చెప్పెను. [31]అందుకు వారు–వేశ్యయెడల జరిగించినట్లు మా సహోదరియెడల ప్రవర్తింప వచ్చునా అనిరి.**

**వచనము 25.** షెకెము మీద **యాకోబు కుమారులలో ఇద్దరు, అనగా దీనా సహోదరులైన షిమ్యోనును లేవియు** దాడి చేశారు. వీరు దీనాకు తోడబుట్టిన అన్నలు; వీరు లేయా పిల్లలు (29:33, 34; 30:21; 34:1). దీనా మానభంగంపట్ల వీరు ప్రతీకారంతో ప్రతిస్పందించడానికి సగం కారణం ఇదేనని తెలుస్తోంది.

షెకెములోని పురుషులకు సున్నతి జరిగిన తర్వాత **మూడవ దినము** వరకు ఈ ఇద్దరు సహోదరులు వేచి చూడడం జరిగింది. ఈ సమయంలో **వారు బాధపడు**తుండడం సహజమనే ఆలోచన ఎవరికైనా వస్తుంది. తొలికాలంనాటి యూదుల టార్గమ్, హెబ్రీలోని ఈ వచనానికి "వారి నొప్పులు (బాధలు) తీవ్రంగా ఉన్నాయి" అని తాత్పర్యం చెబ్తోంది.[18] క్రిమిరాహిత్య ఉపకరణాల్లేని ప్రాచీన కాలంలో మొరటు పని ముట్ల నుపయోగించి చేసే శస్త్రక్రియల్లో ఇటువంటి నొప్పులుండడం సహజమే (యెహోషువ 5:8 చూడండి). దీనికి తోడు, జ్వరం వంటి మరో బాధ కూడా వీరికి నీరసం కలిగించి ఉండవచ్చు. తమకు అవకాశం లభించిన ఈ సమయంలో, **ఇద్దరు** సహోదరులు **తమ కత్తులు చేతపట్టుకొని యెవరికి తెలియ కుండ** [בֶּטַח, *betach*] **ఆ ఊరిమీద పడి ప్రతి పురుషుని చంపి**వేశారు. ఇటువంటి ప్రతీకారచర్య సమర్థ నీయం కాదు; లేయా కుమారులు ఒక మనిషి చేసిన నేరం గురించి పట్టణంలోని పురుషులందరినీ మూకుమ్మడిగా హత్యచేశారు. కొంతమంది వ్యాఖ్యాన రచయితలు ఇది పూర్తిగా అసంబద్ధమని, అంటే షిమ్యోను లేవి అనే ఇద్దరు వ్యక్తులు ఎవరి సహాయం లేకుండా షెకెము పట్టణంలోని పురుషులందరినీ హత్యచేయడం వీలయ్యే పని కాదని సూచిస్తారు. ఒక వేళ వీరు, యాకోబు కుమారులైన తమ ఇతర సోదరుల సహాయాన్ని తీసుకొని ఉండవచ్చని అనుకున్నా గానీ, వాక్యభాగం దీన్ని సూచించడం లేదు. ఈ హత్యల విషయంలో జవాబుదార్లు షిమ్యోను లేవి అనేవారే (34:30).

**వచనము 26.** రచయిత **హమోరును అతని కుమారుడైన షెకెమును కత్తివాత** హత్యకు గురయ్యా రని ప్రత్యేకించి ప్రస్తావించాడు. ఇద్దరూ నేరం చేసినవారే: షెకెము దీనాను బలాత్కరించాడు, హమోరు తన కుమారుని నేరాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించాడు.

ఈ వర్ణనలో ఇక్కడ దీనా పరిస్థితి తెలుస్తోంది: ఆమె **షెకెము ఇంట** ఉంది, బలాత్కారానికి గురైన దీనా తనకు తానుగా ఇష్టపూర్వకంగానైనా అక్కడ

ఉన్నదేమో, లేక ఆమెను బందీగానైనా అక్కడ ఉంచారేమో.[19] కాబట్టి, లేయా కుమారులు తమ సోదరిని **తీసికొని** (*laqach*) యాకోబు నివాసానికి **వెళ్లిపోయిరి** అని తెలుస్తోంది. షెకెము ఈమెను తీసుకొని వెళ్లినప్పుడు కూడా వాక్యభాగంలో ఇదే క్రియావాచక మూల పదం కనబడుతోంది. అతను దీనాను "పట్టుకొని" వెళ్లాడు (34:2), ఇప్పుడు ఆమె సహోదరులు ఆమెను "తీసికొని" వెళ్లారు.

**వచనము 27.** హత్యల అనంతరం, **యాకోబు కుమారులు చంపబడినవారు ఉన్న చోటికి వచ్చి ఆ ఊరు దోచుకొనినట్లు** ఈ వృత్తాంతంలో ఉంది. (షెకెమీయులు) **తమ సహోదరిని చెరిపినందున**, ఈ ప్రతీకార చర్యను సరైన లేక హేతుబద్ధమైన నష్టపరిహారంగా వీరు తలంచారు. షెకెము పట్టణస్థులు షెకెము చర్యల్ని తేలిగ్గా చూడడాన్నిబట్టి లేదా క్షమించడాన్నిబట్టి దీనాకు జరిగిన బలాత్కారానికి వీరూ బాధ్యులేనని ఈ ఇద్దరు సహోదరుల ఆలోచన. యాకోబు మౌనం, తగిన చర్య తీసుకోడంలో అతని వైఫల్యం – ఈ రెండూ కూడా అతని కుమారులు హివ్వీయులమీద ప్రతీకారంతో దాడిచేయడానికి కారణమై ఉండవచ్చు; అయితే తర్వాత, "ఖడ్గము" "స్వేచ్ఛ" "కోపము" "ఉగ్రత"ల్ని బట్టి యాకోబు వీరిని నిందించాడు (49:5-7).

**వచనములు 28, 29.** కనానీయులపట్ల మితిమీరిన ప్రవర్తన ఇంకా కొనసాగింది; యాకోబు కుమా రులు **వారి గొఱ్ఱెలను పశువులను గాడిదలను** మరియు **ఊరిలోనిదేమి పొలములోనిదేమి** సమస్తాన్ని **తీసికొని** వెళ్లారు. చనిపోయినవారి ఆస్తుల్ని దోచుకోడానికి యాకోబు కుమారులందరు వచ్చి ఉండవచ్చు, ఎందుకంటే **వారి ధనము యావత్తును** మరియు **వారి పిల్లలనందరిని వారి స్త్రీలను చెరపట్టి, యిండ్లలో నున్నదంతయు దోచుకొనిరి** అని తెలుస్తోంది.

**వచనములు 30, 31.** దాడి తర్వాత, తనను **బాధపెట్టి ఈ దేశ నివాసు . . . లలోను అసహ్యునిగా చేసితిరి** అని **యాకోబు** మాట్లాడి **షిమ్యోనును లేవిని** నిందించాడు. "అసహ్యునిగా చేసి" (בָּאַשׁ, *ba'ash*) లేదా "కంపు చేసి లేక రోత పుట్టించి" అనే పదం, ప్రతీకారచర్యగా దురాక్రమణలచేత (ప్రత్యాక్రమణలచేత) బాధితులు తమను ఆవేశంతో చీదరించుకొనేలా చేయడాన్ని సూచించే అలంకారిక పదం (నిర్గమ. 5:21; 1 సమూ. 13:4; 27:12; 2 సమూ. 10:6; 16:21).[20] **కనానీయులలోను పెరిజ్జీయులలోను** తనకు శత్రువుల్ని తెచ్చిన తన కుమారుల్ని యాకోబు నిందించాడు. ఈ విషయంలో యాకోబు వాదనలు, "నైతికంగా ఉండడం కంటె, నేర్పుగాను (ఉపాయంగాను) మరియు వ్యూహాత్మకంగాను ఉన్నాయి" (49:5-7 వచనాల్లో లాగా).[21] వారితో పోల్చితే, తన **జనసంఖ్య కొంచెమే** అని, **గుంపుగా వచ్చి** తన మీద దాడిచేసి తనను **చంపెదరు** అని యాకోబు నొక్కి చెబుతున్నాడు. తన **యింటివారును నాశనమగుదురని** అతను భయం వెలిబుచ్చుతున్నాడు. షిమ్యోను లేవి ఇచ్చిన ఒకే ఒక జవాబు ప్రశ్న రూపంలోనే ఉంది, తమ హింసాత్మక చర్యల్ని సమర్థించుకోడానికి ప్రయత్నిస్తూ **వేశ్యయెడల జరిగించినట్లు మా సహోదరి యెడల ప్రవర్తింపవచ్చునా** అని వారు అడిగిన

అల్పమైన ప్రశ్నే ఆ జవాబు.

# అన్వయము

## విధేయతను వాయిదా వేయడం (అధ్యాయము 34)

దేవుని ప్రజలు ఆయనకు విధేయత చూపడంలో వాయిదా వేయడమనే (అలసత్వం, ఆలస్యం) శోధన విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఏశావు ఆగ్రహంనుండి తప్పించుకోడానికి యాకోబు హారానుకు పారిపోతున్నప్పుడు, బేతేలు దగ్గర దేవుడతనికి కలలో ప్రత్యక్షమయ్యాడు. అతనికి తోడుగా ఉంటానని అతను వెళ్లిన ప్రతి స్థలంలోను అతణ్ణి ఆశీర్వదిస్తానని అతని దేశానికి మరల అతణ్ణి తీసుకొని వస్తానని దేవుడతనితో వాగ్దానం చేశాడు. పైగా, యెహోవా పితరునితో (అబ్రాహాము) చేసిన నిబంధనాపూర్వకమైన వాగ్దానాల్ని, అంటే కనాను దేశం, విస్తారమైన సంతానం, భూమ్మీద ఉన్న సమస్త వంశాలకు ఆశీర్వాదంగా ఉండడం వంటి వాగ్దానాల్ని యాకోబుతో మళ్లీ చేశాడు. ఈ దర్శనానికి ప్రతిస్పందనగా, దేవుణ్ణి సేవిస్తానని యాకోబు వాగ్దానంచేశాడు. బేతేలు ("దేవుని ఇల్లు") దగ్గర ఒక స్తంభం నిలబెట్టి, తాను పొందే ఆశీర్వాదాలన్నిటిలో దేవునికి పదవ వంతు ఇస్తానని యాకోబు వాగ్దానం చేశాడు (28:12-22).

బేతేలు దగ్గర యెహోవా యాకోబుకు ప్రత్యక్షమైన తర్వాత ఎన్ని సంవత్సరాలు గడిచాయో వాక్యభాగం తెలియజేయడం లేదు; అయితే అతను ఇరవై సంవత్సరాలు హారానులో గడిపాడని, అక్కడ అతనికి తన భార్యలద్వారా వారి దాసీల ద్వారా పదకొండుమంది కుమారులు ఒక కుమార్తె కలిగారని తెలుస్తోంది. ఇవన్నీ జరిగిన తర్వాత, యాకోబు రాహేలుకు లేయాకు వారి తండ్రి అతనితో ఎలా అబద్ధ మాడాడో, అక్కడున్నంత కాలం తనసెలా మోసగించాడో గుర్తు చేశాడు. దేవుడు తనకు ప్రత్యక్షమై, తన దేశానికి (31:13), అంటే తన తండ్రి నివాసం ఉంటున్న తన దేశానికి తిరిగి వెళ్లమని చెప్పాడని కూడా అతను తన భార్యలకు వెల్లడించాడు. అయితే, యొర్దాను తూర్పువైపున లాబాను తమను విడిచిపెట్టి వెళ్లిన తర్వాత, దేవుని ఆజ్ఞ ప్రకారం నది దాటి కనానులోకి ప్రవేశించకుండా, యాకోబు అతని కుటుంబం సుక్కోతులో స్థిరపడి అక్కడ చాలా కాలం నివసించారని స్పష్టంగా తెలుస్తోంది. అక్కడ అతను నివాస గృహాన్ని కూడా నిర్మించుకొని తన మందలకు పాకలు కూడా వేశాడు (33:17). చివరకు అతను యొర్దాను దాటి కనానుకు తిరిగి వచ్చినప్పుడు, షెకెములో తన కుటుంబంకొరకు ధర చెల్లించి ఒక పొలం కొన్నాడు (33:18-20). అధ్యాయం-34లోని సంఘటనలు జరగడానికి పూర్వం అతనక్కడ ఎంత కాలం నివసించాడో తెలియడంలేదు.

యాకోబు బేతేలుకు తిరిగి వెళ్లడానికి లేదా హెబ్రోను దగ్గర ఉన్న తన తండ్రి ఇంటికి తిరిగి వెళ్లడానికి ఎందుకు సందేహించాడు? (1) ఎదోములో ఉన్న

ఏశావుకు అతిసమీపంలో నివసించడానికి బహుశా భయపడి ఉండవచ్చు. (2) ఈపాటికి తన తండ్రి మరణించి ఉంటాడని తలంచి ఉండవచ్చు – లేదా తాను అబద్ధాలాడి తన తండ్రిని మోసగించాడు కాబట్టి తన తండ్రి యెదుటికి రావడానికి ఇబ్బంది పడతానని ఆలోచించి ఉండవచ్చు. (3) అప్పటికే తాను తన సంపదయైన పశువులమందల్లో చాలా భాగం ఏశావుకు ఇచ్చివేశాడు (33:8-11), కాబట్టి మరో పదవ భాగాన్ని బేతేలు దగ్గర దేవునికి ఇవ్వ డానికి అతని మనసు అంగీకరించక పోయి ఉండవచ్చు (28:22 చూడండి). దేవునికి విధేయత చూపడంలో వాయిదా వేయడానికి యాకోబుకున్న కారణాలు ఏవైనప్పటికీ, అది విషాదకరమైన మరియు బాధకరమైన పరిణామాలకు దారి తీసింది.

దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి ఆయన పిలుపును వినినప్పుడు, వాయిదా వేయడం లేదా పాక్షికంగా విధేయత చూపడం అవివేకమే అవుతుంది. ఇటువంటి స్పందనలున్న పలు ఉదాహరణలు బైబిల్లో ఉన్నాయి. (1) సౌలు రాజు పాక్షికమైన విధేయత చూపినప్పుడు సమూయేలు అతణ్ణి ఆక్షేపించాడు (1 సమూ. 15:22, 23). (2) విధేయత విషయంలో అలసత్వం చూపకూడదని కీర్తనకారుడు తన సమకాలీకుల్ని హెచ్చరించాడు: "నేడు మీరు ఆయన మాట నంగీకరించినయెడల ఎంత మేలు. అరణ్యమందు మెరీబా యొద్ద మీరు కఠినపరచుకొనినట్లు మస్సా దినమందు మీరు కఠినపరచుకొనినట్లు మీ హృదయములను కఠినపరచుకొనకుడి" (కీర్తన. 95:7c-11). (3) ప్రభువుపట్ల విధేయత చూపడంలో ఆలస్యంచేయవద్దని యూదు క్రైస్తవుల్ని ప్రోత్సాహపర్చడానికి ఈ కీర్తననే హెబ్రీ పత్రిక రచయిత ప్రస్తావించాడు (హెబ్రీ. 3:7-4:11). (4) బబులోను చెరకు శతాబ్దాల పూర్వం, యెషయా ప్రవక్త ఇశ్రాయేలీయులు బబులోను చెరనుండి తిరిగి వచ్చే కాలంగురించి, అంటే వారు పాలస్తీనాకు తిరిగి వచ్చి పాడైపోయిన స్వాస్థ్యాల్ని తిరిగి నిర్మించుకొని తమ జీవితాల్ని చక్కపర్చుకొనే కాలాన్ని "అనుకూల సమయ"మని ("రక్షణ దినము") ముందుగానే చెప్పాడు (యెషయా 49:8-10). యూదా దేశంనుండి బబులోను చెరలోకి వెళ్లినవారిలో కొందరు అలసత్వంతో, దేవుని పిలుపును నిరాకరించి; వాగ్దాన దేశానికి ఎన్నటికీ తిరిగి రాలేదు. (5) యెషయా మాటల్నే పౌలు మరో విధంగా ప్రస్తావించాడు: "దేవుని కృపను వ్యర్థము చేసికొనవద్దని", క్రీస్తుకొరకు చేసే పరిచర్యకు అభ్యంతరం కలిగించకూడదని క్రైస్తవుల్ని హెచ్చరించాడు. కొరింథీయులు తత్‌క్షణమే ప్రతిస్పందించాలని పౌలు మనవి చేస్తూ, "ఇదిగో, ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" అని దేవుడు సెలవిచ్చినదాని గురించి ప్రస్తావించాడు (2 కొరింథీ. 6:1-3). (6) దేవుని పిల్లలుగా "నడుచు"కొనే విషయంలో అజాగ్రత్తగా ఉన్న ఎఫెసీయులకు కూడా పౌలు ఇటువంటి విజ్ఞప్తినే చేశాడు. "దినములు చెడ్డవి గనుక" నిద్రలో నడిచేవారిలాగా ఉన్న వీరు నిద్ర మేల్కొని సమయం పోనివ్వకుండా సద్వినియోగం చేసుకోవాలని పౌలు చెప్పాడు (ఎఫెసీ. 5:14-16).

దేవుణ్ణి సేవించడంలో వాయిదా వేసే (ఆలస్యంచేసే) శోధన క్రైస్తవులకు

మాటిమాటికీ ఎదురవుతూనే ఉంటుంది. మనం చురుకుగా వివేకంతో పనిచేసేలాగా ఆయనే మనకు సహాయం చేయుగాక.

## దారితప్పిన కుమారులు (అధ్యాయము 34)

తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో బాధ్యతను విస్మరించే శోధనగురించి అప్రమత్తంగా ఉండాలి. యాకోబు బాధ్యతల్ని అంతగా పట్టించుకోని కుటుంబంలో పెరిగాడు. తల్లి అతణ్ణి గారాబం చేయగా, తండ్రి ఏశావుపట్ల మిక్కిలి ప్రేమ చూపించాడు. ఈ పక్షపాతధోరణి తల్లిదండ్రుల మధ్య ఉద్రిక్తతకు, ఇద్దరు అన్నదమ్ముల మధ్య కలహానికి కారణమైంది. రాహేలు పిల్లలపట్ల (యోసేపు, బెన్యామీను) యాకోబు అతిగా ప్రేమ చూపించాడు, ఇది బహుశా లేయా పిల్లల్లో తమ తల్లిలాగానే తాము కూడా వివక్షకు గురయ్యామనే తలంపుల్ని కలిగించి ఉండవచ్చు. కుటుంబంలో ఈ వివాదం ఫలితంగా, యాకోబు కుమారుల్లో పదిమంది యోసేపును బానిసగా అమ్మివేయడానికి చాలా కాలం ముందే తమ తండ్రిపట్ల గౌరవం కోల్పోయారు (37:3, 4; 42:4, 36-38; 43:8-16 చూడండి).

యాకోబు భౌతికంగా తన పిల్లలకు దూరంగా లేనప్పటికీ, అతను తండ్రిగా నాయకత్వం వహించడంలోను పిల్లలకు ఉపదేశించడంలోను వారిని క్రమశిక్షణలో పెట్టడంలోను పెద్దగా బాధ్యత చూపలేదనే వర్ణన ఈ అధ్యాయంలో కనబడుతుంది. దీనాకు ఉపదేశించి ఆమెకు మార్గనిర్దేశం చేసే బాధ్యతను యాకోబు లేయాకు అప్పగించి ఉండవచ్చు; అయితే, భక్తిహీనులైన మనుషులు ఆమెను పట్టుకొని వెళ్ల కుండా, అతను తమ కుమార్తె ఇల్లు విడిచి ఒంటరిగా బయట తిరగకూడదని, తోడులేకుండా అన్య పట్టణం లోకి వెళ్లకూడదని హెచ్చరిక చేసి ఉండ వలసినది.

యాకోబు దీనాకు జరిగిన బలాత్కారం గురించి విషాదవార్త వినినప్పుడు, మాట ఉల్లంఘించిన కుమార్తెపట్ల తండ్రి చూపే బాధ్యతాయుతమైన కోపాన్ని యాకోబు చూపినట్టు కనబడలేదు. దీనా దీనస్థితి పట్ల అతను ఉదాసీనంగానే ఉన్నాడు, ఈ మొత్తం ఉదంతంపట్ల ఆతను నిరాసక్తతతో కూడిన మౌనం వహించాడు. అతను ఆవేదన చెందాడని గానీ, లేదా ఈ నేరపూరిత చర్య చేసిన వ్యక్తికి శిక్ష విధించాలని, అతనినుండి నష్టపరిహారాన్ని అడగాలని అతను భావించినట్టుగా గానీ వాక్యభాగం తెలియజేయడం లేదు. తన కుమార్తెను ప్రేమించే ఏ తండ్రియైనా, తన కుమార్తెపట్ల బాధ్యత వహిస్తూ ఆమెపై అజమాయిషీ చేసే ఏ తండ్రియైనా ఈ విధంగా ప్రవర్తించడం చాలా వింతగా ఉంటుంది.

యాకోబు కుమారులు పొలంనుండి ఇంటికి తిరిగి వచ్చి దీనాకు జరిగినదానిని తెలుసుకున్నప్పుడు వారి ప్రతిచర్య తమ తండ్రి ప్రతిచర్యకంటె చాలా సహజంగా ఉంది. తమ సహోదరి దీనాకు జరిగినది "చేయరాని పని" కాబట్టి వారు "సంతాపము పొందిరి" అని, వారికి "మిగుల కోపము వచ్చెను" అని వాక్యభాగం తెలియజేస్తోంది (34:7). అయితే, వీరి కోపం ఎక్కువ సేపు నిలిచి లేదు; షెకెము

తన తండ్రి హమోరుతోబాటు వచ్చి యాకోబు ఏకైక కుమార్తెను తాను వివాహం చేసుకోడానికి అనుమతి నడిగాడు. ఈ కనానీయులు జరిగిన తప్పుకు క్షమాపణ చెప్పలేదు, షెకెము ఇంట్లో దీనా నెందుకు ఉంచారో వివరణ ఇవ్వలేదు. అయినాగానీ, తన కుమారులకు దిగులుతో నిండిన విస్మయం కలిగేలా యాకోబు మౌనం వీడలేదు, ఏ అభ్యంతరం చెప్పలేదు. హమోరు ఆర్థిక ప్రయోజనాల గురించి, వ్యాపారం మరియు ఆస్తుల కొనుగోలు సహా వాగ్దానాలు చేశాడు, షెకెము వారు అడిగినంత ఓలి మరియు కట్నం ఇస్తానని ముందుకు వచ్చాడు; అయితే ఈ వ్యవహారమంతటిలో ఏదీ యాకోబును మాట్లాడించలేక పోయింది (34:6-12).

ఈ సమయానికి, దీనా సహోదరులకు తమ తండ్రిపట్ల ఓపిక నశించింది. బలాత్కారానికి గురైంది అతని స్వంత కుమార్తె గనక, మరియు యాకోబు మౌనాన్ని అతని ఉదాసీన వైఖరిని కనానీయులు అతని బలహీనతగా అర్థం చేసుకుంటారు గనుక, యాకోబు ఇప్పుడు తప్పకుండా మాట్లాడవలసిన పరిస్థితి ఎదురైంది. పితృస్వామ్య సమాజంలో, యాకోబుకు తన కుటుంబంలో గౌరవం లేదని, వ్యవహార మంతా అతని కుమారులు నడిపిస్తున్నందున అతను తండ్రిగా తన బాధ్యతను కుమారుల చేతికి అప్పగించాడని హమోరు షెకెములు ఎందుకు తలంచకూడదు (34:13)?

దీనాను ఈ యువకుడికి ఇచ్చి పెళ్లి చేసే విషయంలో ఆమె సహోదరులు కనానీయులతో మాట్లాడిన మాటలే కొంతలో కొంత యథార్థంగా కనబడుతున్నాయి. అయినా, వారు ఒక అడ్డంకి (అభ్యంతరం) గురించి చెబుతున్నారు – అంటే సున్నతి విషయం గురించి – ఇదే దీనాను షెకెముకిచ్చి వివాహంచేయడానికి వారి మధ్య ఆటంకంగా ఉంది. పట్టణంలోని పురుషులకు సున్నతి లేకుండా, రెండు కుటుంబాల మధ్య పెళ్లి సంబంధం తమకు అవమానం అని దీనా సహోదరులు ఎత్తి చెప్పారు.

దీనా సహోదరులు ఎలా ఎప్పుడు ఈ నిర్ణయానికి వచ్చారో రచయిత వివరించలేదు. బహుశా వారు తమ తండ్రి కనానీయులకు వ్యతిరేకంగా ఏ చర్యా తీసుకోడని తలంచి, లేదా బలాత్కారించి నేరం చేసిన వ్యక్తికి శిక్షపడాలని కూడా వత్తిడి చేయడని తలంచి ఉండవచ్చు; ఇదే గనక కారణమైతే, వారు తమ తండ్రిని మరియు కనానీయుల్ని కలుసుకోడానికి పూర్వమే హింసాత్మక చర్య గురించి నిర్ణయించు కొని ఉండవచ్చు. ఈ హత్యల్లో వీరి తమ్ముళ్లు పాల్గొన్నారనే ప్రస్తావన కనబడడం లేదు; అయితే వారు తర్వాత స్త్రీలను పిల్లల్ని దాసుల్ని పశువుల్ని ఆస్తుల్ని దోచుకోడంలో వీరితోబాటు పాల్గొని ఉండవచ్చు. వారి చర్యల వెనక ఉద్దేశాలు ఏమైన ఉన్నప్పటికీ, వారు తమ తండ్రికి తమ మీద ఆగ్రహం కలుగుతుందనే విషయాన్ని అసలు పట్టించుకోలేదు. సంవత్సరాలు గడిచేకొద్దీ, వారిమీద యాకోబుకు బాధ్యతాయుత నియంత్రణ గానీ అజమాయిషీ గానీ లేదన డానికి వారి ప్రవర్తనే రుజువు.

దైవభక్తి గలిగిన తల్లిదండ్రులైనప్పటికీ, పిల్లలమీద బాధ్యతాయుతమైన

నియంత్రణ చూపడంలో వైఫల్యం ఉన్న కుటుంబాల్లో ఇటువంటి విషాదాలే చోటుచేసుకున్నాయి:

1. ఏలీ కుమారులు "జనులు యెహోవాకు నైవేద్యము చేయుటయందు అసహ్యపడుటకు కారణమైరి", మరియు ప్రత్యక్షపు గుడారంయొక్క ద్వారం దగ్గర సేవించడానికి వచ్చిన స్త్రీలతో వ్యభిచరించారని తెలుస్తోంది. వారి తండ్రియైన వృద్ధ యాజకునికి తన కుమారులు ఏం చేస్తున్నారో తెలిసినప్పుడు, అతను వారిని మందలించడం జరిగింది; అయినా, అతను తండ్రిగా వారిమీద అధికారాన్ని నియంత్రణను (అజమాయిషీ) చూపలేకపోయాడు. వారు అతని మాట వినలేదు (1 సమూ. 2:12-25). వీరి ధిక్కార వైఖరి మరియు చర్యలు యుద్ధంలో ఇశ్రాయేలు ఓటమికి, నిబంధన మందసాన్ని కోల్పోడానికి, ఏలీ మరణానికి, అతని కుమారుల మరణానికి, మరియు కోడలి మరణానికి దారి తీసాయి (1 సమూ. 4:1-22).

2. తన పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టడానికి సమ్మతి చూపని తండ్రిగా పిల్లలమీద నియంత్రణ (అజమాయిషీ) కోల్పోయిన తండ్రిగా మరో విషాద దృష్టాంతం దావీదు. అతనికి అనేకమంది భార్యలు పిల్లలున్నారు; అతని పాపపు చర్యలు అతనిమీద అతని పిల్లలకున్న గౌరవం పోయేలా చేశాయి; వీటిలో అతను బత్షెబతో చేసిన పాపం కూడా ఒకటి. మొదటగా, రాజు ఆమెతో వ్యభిచరించాడు, ఆమె గర్భవతి అయ్యింది. తర్వాత, తన పాపాన్ని కప్పిపుచ్చుకోడానికి, అతను బత్షెబ భర్తను యుద్ధంనుండి వెనక్కి పిలిపించాడు, అతను తన ఇంటికి వెళ్లి తన భార్యతో దాంపత్యం నెరపుతాడని ఎదురుచూశాడు. ఈ ప్రయత్నం ఫలించక పోవడంతో, భయంకరమైన యుద్ధంలో అతను ముందుభాగంలో ఉండేలా అక్కడనుండి యోవాబు తప్పించుకొనేలా, ఊరియా తప్పకుండా యుద్ధంలో చావుకు గురయ్యేలా రాజు యోవాబును ఆదేశించాడు (2 సమూ. 11:1-27).

నాతాను ప్రవక్త దావీదు వ్యభిచారాన్ని మోసాన్ని (కుట్ర) బహిర్గతం చేసినప్పుడు (2 సమూ. 12:1-25), రాజు సైనికులు నమ్మకద్రోహానికి గురయ్యామని తలంచి ఉండవచ్చు, మరియు వారు నిరుత్సాహపడి ఉండవచ్చు. అంతకంటె చెడ్డపరిస్థితి, తన కుమారులతో దావీదు సంబంధాలు చెడిపోయాయి. వారు పెరిగి పెద్దవారవుతున్నప్పుడు, తమ తండ్రి వేషధారణబట్టి, తమ తండ్రికి అత్యంత విశ్వాసపాత్రుడైన ఊరియా హత్యనుబట్టి ఇతరుల ఎగతాళికి వారు గురై ఉండవచ్చు. రాజు చర్యలు బయటికి తెలియడం అతని చిన్నపిల్లలకు మానసికంగాను ఆధ్యాత్మికంగాను వినాశనకరమేనని చెప్పవచ్చు. దావీదు ఘోర పాపాలు అతనిపట్ల వారి నమ్మకాన్ని తుడిచివేశాయి.

3. దావీదు తన పిల్లల్ని సరైన మార్గంలో నడిపించడాన్ని వారిని క్రమశిక్షణలో పెంచడాన్ని అంతగా పట్టించుకోలేదు. తమ తండ్రి తమనెప్పుడూ మందలించడని లేదా తాము ఏం చేసినా శిక్షించడని వారి గట్టి నమ్మకం. అతని కుమారుడు అమ్నోను తన సహోదరి దావీదు కుమార్తె అయిన తామారును

బలాత్కరించడానికి బహుశా ఇది కూడా ఒక కారణం అయ్యుంటుంది. దావీదుకు ఈ విషయం తెలిసినప్పుడు, అతను ఆగ్రహం వెలిబుచ్చినా, అతను అమ్నోనును దండించడానికి ఏమీ చేయలేదు (2 సమూ. 13:1-21). ఇది అబ్షాలోముమీద గాఢమైన ప్రభావం చూపింది. తన తండ్రి ఏమీ చేయకపోవడం అబ్షాలోము చూచి, తన సోదరుడైన అమ్నోనును చంపివేశాడు. సహజంగానే, ఇది దావీదును తీవ్రమైన దుఃఖంలో ముంచివేసింది; అయినా, అతను మళ్లీ ఏమీ చేయలేదు. అతను అబ్షాలోమును శిక్షించాలనుకోలేదు (2 సమూ. 13:20-39).

4. ఆ తర్వాత, దావీదుకు తన పిల్లలతో సంబంధం తగ్గిపోవడం, మరియు తండ్రిగా వారిమీద నియంత్రణ చూపకపోవడం అతను తన రాజ్యంలోని ప్రజలకు సంబంధించిన వ్యవహారాల్ని కూడా నిర్లక్ష్యం చేయడంలో ప్రతిబింబించసాగింది. కాలం గడిచే కొద్దీ, అబ్షాలోము ఇశ్రాయేలీయుల మనసులు దోచుకున్నాడు. దావీదు అధికారం బలహీనపడింది, రాజ్యసింహాసనాన్ని అతని కుమారుడైన అబ్షాలోము అన్యాయంగా లాక్కోడానికి ప్రయత్నించాడు (2 సమూ. 15:1-23). దావీదు తన సైన్యంలో కొంతమందిని అబ్షాలోము బలగానికి వ్యతిరేకంగా పంపినప్పటికీ, రాజు తన కుమారుణ్ణి శిక్షించడాన్ని నివారించాడు. అబ్షాలోముకు ఏ హాని చేయకూడదని దావీదు యోవాబుకు అతని మనుషులకు కచ్చితమైన ఆదేశాలిచ్చాడు; అయితే, అబ్షాలోము బ్రతికి ఉంటే గనక రాజు జీవితం అపాయంలో పడుతుందని గ్రహించిన వీరు అబ్షాలోమును చంపివేయడం జరిగింది (2 సమూ. 18:5-15; 19:1-7).

5. దావీదు తండ్రిగా తన అధికారాన్ని ఉపేక్షించాడని సుస్పష్టంగా తెలిపే చివరి ఉదాహరణ, అదోనీయా తనకొరకు ఇశ్రాయేలు రాజ్యసింహాసనాన్ని స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నించడం. దావీదు అనంతరం అతని కుమారుడైన సొలొమోను రాజు అవుతాడని దేవుడు దావీదుతో చెప్పాడు (1 దిన. 22:5-10); అయితే అదోనీయాలో పదవీకాంక్ష ఎంతగా ఉందంటే, తనను తానే రాజుగా హెచ్చించుకొని "నేనే రాజునగుదును" (1 రాజులు. 1:5) అని చెప్పడం జరిగింది. అతను తన పట్టాభిషేకం కొరకు ఏర్పాట్లు చేసుకోడం ప్రారంభించాడు. "అతని తండ్రి – నీవు ఈలాగున ఏల చేయుచున్నావని అతని చేత ఎప్పుడును విచారించి" (1 రాజులు. 1:6) ఉండలేదని రచయిత వెల్లడిచేశాడు. తన తండ్రి మరణించక ముందే, అదోనీయా తన తండ్రిపట్ల అమర్యాదపూర్వకంగా చేసిన చర్య, యోవాబు అబ్యాతారు మరియు ఏబైమంది మనుషులు అదోనీయాను రాజుగా ప్రకటించడం (1 రాజులు. 1:5-7, 11-13, 25). చివరగా, దావీదుకు అతని కుమారుడు చేసిన పనిగురించి తెలిసినప్పుడు, అతను నాతానును సాదోకును తన స్థానంలో సొలొమోనును రాజుగా పట్టాభిషేకం చేయమని ఆదేశించాడు (1 రాజులు. 1:32-40). దావీదు మరణం తర్వాత, దావీదుకు భార్యగా అతని ఆలనాపాలనా చూచిన అబీషగును తన భార్యగా స్వీకరించి సింహా సనానికి హక్కుదారుడు కావడానికి ప్రయత్నించడం అదోనీయా జీవితంలో అంతిమ విషాదఘట్టం. అదోనీయా

వక్రపథకాన్ని గ్రహించిన సొలొమోను, తన అన్నను (అదోనీయా) చంపమని దుఃఖాక్రాంత మైన ఆజ్ఞను జారీ చేశాడు (1 రాజులు. 2:13-25).

తండ్రులు, తండ్రులుగా తమ బాధ్యతల్ని నిర్వహించడంలో వైఫల్యం చెందినప్పుడు కుటుంబాల్లో సమాజాల్లో ఏ యే విషాదాలు జరుగుతాయో! కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి మాదిరిగా నిలిచే విషయంలో విఫలులు కావడమే వారి విషయంలో పాపం; మరి కొందరి విషయంలో తల్లిదండ్రులుగా వారు తమ పిల్లలమీద అజమాయిషీ చేసి వారిని క్రమశిక్షణలో పెట్టే బాధ్యతల్ని పూర్తిగా ఉపేక్షించడమే పాపం. ఈ కారణంచేతనే, జ్ఞాని ఒకరు “బెత్తము వాడనివాడు తన కుమారునికి విరోధి, కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును” (సామెతలు 13:24) అని వ్రాయడం జరిగింది. “విరోధి” అనే పదం ఈ సందర్భంలో “తక్కువగా ప్రేమించడం” అనే అర్థాన్నిస్తుంది (29:30-33 చూడండి), అంటే ఇటువంటి తండ్రి తన కుమారుణ్ణి క్రమశిక్షణలో పెట్టేంతగా ప్రేమించడని ఇది సూచిస్తోంది. మరొక వాక్యభాగం దీనికి దగ్గరగా ఉంటుంది: “బెత్తమును గద్దింపును జ్ఞానము కలుగజేయును, అదుపులేని బాలుడు తన తల్లికి అవమానము తెచ్చును” (సామెతలు 29:15; మరియు ఎఫెసీ. 6:4; కొలొస్సి. 3:21 చూడండి). క్రమశిక్షణ క్రూరంగా (మొరటుగా, పశుప్రాయంగా) ఉండాలని ఏ వాక్యభాగం చెప్పడం లేదు; గానీ క్రమశిక్షణకు మూలం పిల్లలపట్ల తల్లిదండ్రులకున్న ప్రేమేనని చెబ్తోంది. ప్రేమగల తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి ప్రవర్తన అలవర్చుకొనేలా వారికి శిక్షణనిచ్చి, తమ పిల్లలకు మరియు ఇతరులకు అంగీకారంకానివి మరియు అపాయకరమైనవి అయిన పనులేవో వారు తెలుసుకొనేలా వారిలో జ్ఞానాన్ని (వివేకం, బుద్ధి) పెంపొందించి వారిని సరిదిద్దుతారు. క్రమశిక్షణలో ప్రేమ లేకుండా పెరిగిన పిల్లలు వాస్తవానికి తాము ప్రేమ పొందడంలేదనే భావనలో ఉంటారని, తరచుగా వారు తమ మీద తామే కోపాన్ని బాధకలిగించే వైఖరుల్ని వెళ్లగ్రక్కడంతోబాటు, తమ చుట్టూ ఉన్నవారి మీద కూడా కోపాన్ని బాధకలిగించే వైఖరుల్ని వెళ్లగ్రక్కుతూ అటువంటి చర్యలనే ప్రదర్శిస్తారనే పాఠాన్ని బైబిలు బోధిస్తుంది, అనుభవపూర్వక వాస్తవాలు కూడా ఇదే విషయాన్ని బోధిస్తున్నాయి.

## ప్రతీకారం తీర్చుకోడం (అధ్యాయము 34)

తప్పుచేసినవారిపట్ల ప్రతీకారం తీర్చుకోవాలనే శోధన విషయంలో దేవుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దీనా బలాత్కారం తర్వాత, షెకెము మరియు అతని తండ్రి హమోరు యాకోబు నివాసాన్ని దర్శించి దీనా విషయంలో జరిగిన అపవిత్రకార్యం విషయమై అతణ్ణి అతని కుమారుల్ని శాంతింప చేయా లని ప్రయత్నించారు. వీరిద్దరికీ వివాహం చేసి హమోరు యాకోబు కుటుంబంతో బంధుత్వం ఏర్పరచు కోవాలని హమోరు ప్రతిపాదించాడు; ఈ క్రొత్త చుట్టరికం (బంధుత్వం) వలన యాకోబు కుటుంబానికి ఆ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఇంకా

ఎక్కువ భూభాగం మరియు పశువుల మందల మేతకొరకు అదనపు పచ్చికబయళ్లమీద హక్కులు వస్తాయి. తండ్రి ప్రతిపాదనకు అదనంగా, షెకెము దీనాను వివాహం చేసుకోడానికి యాకోబు అడిగినంత ఓలిని కట్నాన్ని ఇస్తానని ముందుకు వచ్చాడు. ఈ ప్రతిపాదనలు ఉదారంగా కనబడినప్పటికీ, షెకెము అతను తమ సహోదరికి చేసిన అవమానాన్ని రూపుమాపడానికి చాలినవనిగా యాకోబు కుమారులు పరిగణించలేదు.

హమోరు షెకెములు చేసిన ప్రతిపాదనలు పైకి ఇరుపక్షాలకు అనుకూలంగా ఉన్నట్టుగానే కనబడుతున్నాయి. అయితే, యాకోబు కుమారులు మోసపూరితంగా వారికి జవాబిచ్చారు. షెకెము పట్టణంలోని పురుషులందరూ సున్నతి షరతుకు ఒప్పుకోవాలని దబాయింపుగా అడగడంలో, సమాజంలో దీనాకు గురైన అవమానాన్ని వారు పెద్దగా పట్టించుకున్నట్టు కనబడడం లేదు. వారి మనసుల్లో ప్రతీకారం రగులుతోంది, వారి ప్రతీకారచర్య (ఎదురు దాడి) షెకెము చేసిన అవమానకరమైన కార్యం కంటె ఎన్నో రెట్లు అధికంగా ఉంది.

ప్రాచీన పశ్చిమాసియాలో, *lex talionis* అనే పేరుతో ఉన్న “ప్రతీకార నియమం” అమలులో ఉండేది. హమ్మురాబి న్యాయవిధిలోను (క్రీస్తు పూర్వం 1750లో దీన్ని వ్రాయడం జరిగింది), మోషే ధర్మశాస్త్రంలోను ఈ నియమం కనబడుతుంది. ఈ కట్టడలోని ముఖ్యమైన అంశాలు “కంటికి కన్ను, పంటికి పన్ను” (నిర్గమ. 21:24; లేవీ. 24:20; ద్వితీ. 19:21).[22] ఆధునిక కాలంలో ఇది మనకు అనాగరిక (మోటు) చర్యగా ఉన్నప్పటికీ, వాస్తవానికి ఇది చట్టవ్యతిరేక చర్యలపట్ల (అసాంఘిక చర్యలు) మానవత్వంతో కూడిన శిక్షనే ఇది సూచిస్తుంది. కార్యాచరణలో, శిక్ష నేరానికి తగినదిగా ఉండాలని, శిక్ష అనవసరంగా నేరంకంటె తీవ్రస్థాయిలో ఉండకూడదని ఇది సూచిస్తుంది. ఉదాహరణకు, సమాజంలో ఒకే స్థాయిలో ఉన్న ఇద్దరు పోట్లాడుకున్నప్పుడు, ఒకరు గట్టిగా కొట్టిన దెబ్బవలన మరో వ్యక్తి కన్ను పోయి నట్లయితే, నేరంచేసిన వ్యక్తికి వేయవలసిన తీవ్రమైన కఠిన శిక్ష అతని రెండు కళ్లల్లో ఒకదాన్ని తీసివేయడమే. ఈ విషయంలో నేరస్థుడి రెండు కళ్లు తీసివేయడం గానీ, లేదా ఇంకా తీవ్రమైన మరో శిక్ష వేయడం గానీ చేయకూడదు.

షిమ్యోను లేవి చేసిన నేరం, షెకెము దీనాను బలాత్కరించిన నేరానికి అతనికి న్యాయస్థానం విధించే శిక్షను మించి ఉంది. ఒక వ్యక్తి చేసిన నేరానికి, యాకోబు కుమారులు షెకెము పట్టణంలోని పురుషులందరినీ మూకుమ్మడిగా హత్య చేసి, స్త్రీలందరినీ పిల్లలందరినీ బంధించి, వారి గొర్రెల మందల్ని పశువుల మందల్ని ఆస్తుల్ని దోచుకున్నారు. వీరు యావత్‌సమాజంపట్ల ప్రతీకారం తీర్చుకోడం మాటల్లో చెప్పలేని దుశ్చర్య, మితిమీరిన ఆగ్రహంతో ఎదురుదాడి చేయడం ఎలా హద్దులు దాటుతుందో ఇది నిరూపిస్తుంది. యేసు ఇటువంటి ప్రవర్తనగురించి పర్వత ప్రసంగంలో హెచ్చరించాడు (మత్తయి 5:38-42). ఆగ్రహం (మితిమీరిన కోపం) దావానలం లాగా ప్రజ్వరిల్లి వ్యాపించి, నిజమైన శత్రువులపట్ల శత్రువులని

భావించిన వారిపట్ల ఊహకందని విధంగా ప్రతిదాడులు చేయడానికి మనుషుల్ని పురికొల్పుతుంది.

పౌలు రోమాలోని క్రైస్తవులకు వ్రాసిన పత్రికలో ఇటువంటి సమస్యనే విడమర్చి చెప్పాడు:

> కీడుకు ప్రతికీడెవనికిని చేయవద్దు; మనుష్యులందరి దృష్టికి యోగ్యమైనవాటినిగూర్చి ఆలోచన కలిగి యుండుడి. శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుషులతో సమాధానముగా ఉండుడి. ప్రియులారా, మీకు మీరే పగ తీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి. – పగ తీర్చుట నా పని, నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. కాబట్టి, నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింప బడక, మేలు చేత కీడును జయించుము (రోమా. 12:17-21).

ఇది పౌలు విషయంలో కూడా అవసరమైన పాఠమే. నిష్ఠాగరిష్ఠుడైన పరిసయ్యుడిగా, సౌలు (హెబ్రీలో పౌలు కున్న పేరు) యేసు ఒక ప్రమాదకరమైన ధర్మవిరోధి (మతవిరోధి) అని, యూదు మతవిశ్వాసాల్ని ధిక్కరించే తిరుగుబాటుదారుడని అభిప్రాయపడ్డాడు. మతాభిమానియైన పౌలు, క్రీస్తును వెంబడించిన వారిని (అనుసరించినవారిని) బంధించి చెరసాలలో పెట్టి వారిని హింసించడంతోబాటు, చివరికి వారిని మరణానికి అప్పగించడానికి సైతం సిద్ధపడ్డాడు. అప్పుడు, సౌలు దమస్కు మార్గంలో పునరుత్థానుడైన యేసును ముఖాముఖిగా కలుసుకున్నాడు. దైవిక ప్రతీకారానికి పాత్రుడైన సౌలుకు, ప్రతీకారానికి బదులుగా యేసులో కృప పాపక్షమాపణ మరియు దేవుని ప్రేమ సాక్షాత్కరించాయి. పైగా అతను, మెస్సీయాయైన (క్రీస్తు) యేసు రక్తంద్వారానే సర్వమానవాళికి పాపక్షమాపణ రక్షణ కలుగుతాయనే సువార్తను (శుభసందేశం) ప్రకటించడమనే నూతన కర్తవ్యాన్ని జీవితంలో కనుగొన్నాడు (అపొ. 26:9-18; రోమా. 1:16; 3:21-30; 6:1-7). అనేక సంవత్సరాల తర్వాత, పౌలు తిమోతికి తాను పొందిన దైవ కృపగురించి (నిష్కారణమైన కటాక్షం) వ్రాశాడు – తనగురించి తాను క్రీస్తులో ప్రేమను పాపక్షమాపణను పొందిన ప్రధానపాపియైన దూషకుడను హింసకుడను హానికరుడను అని చెప్పాడు. సౌలు క్రైస్తవులకు చేసిన హాని అంతటినిబట్టి, దేవుడతనిమీద తన ఉగ్రతను కుమ్మరించడానికి బదులు, అతణ్ణి క్షమించడం తోబాటు అతనికి సువార్త ప్రకటన అనే పరిచర్యను లేదా “సేవ”ను కూడా అప్పగించాడు (διακονία, *diakonia*; 1 తిమోతి. 1:12-16).

కృపకు పరిపూర్ణమైన ఉదాహరణ యేసు ఒక్కడే. కృపగురించి యేసు తరచూ చెబ్తూ తన జీవితంలో కృపను ఆచరించి చూపాడు. తనను అన్యాయంగా అపహాస్యంచేసినా, కొట్టినా, ముళ్ల కిరీటం పెట్టినా, మేకులతో సిలువకు కొట్టినా

ఆయన తనకు మరణశిక్ష విధించినవారిని శపించలేదు, లేదా వారి మీదకు దేవుని ఉగ్రత రావాలని వేడుకొనలేదు; బదులుగా ఆయన "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" (లూకా 23:34) ప్రార్థించాడు. ఆయన మరణాన్ని కళ్లారా చూచినవారి మీద ఈ ప్రార్థన గాఢమైన ప్రభావం చూపింది, మరీ ముఖ్యంగా సిలువవేయడాన్ని పర్యవేక్షించిన రోమన్ శతాధిపతిమీద గాఢమైన ప్రభావాన్ని చూపింది. న్యాయస్థానంలో విచారణ జరిపిన సమయంలో పలు సార్లు, పొంతి పిలాతు యేసులో ఏ నేరమూ లేదని ఆయన నిర్దోషి అని ఎలా ప్రకటించాడో ఆ శతాధిపతికి తెలుసు; అయినా గానీ, పిలాతు యూదుల రాజకీయ వత్తిళ్లకు లొంగి ఆయణ్ణి సిలువ వేయడానికి అప్పగించాడు. సైనికాధికారియైన ఈ వ్యక్తి అనేకమంది మరణశిక్ష ననుభవించడాన్ని కళ్లారా చూచినవాడే; అయితే మరణించే వ్యక్తి తనను మరణానికి అప్పగించినవారికొరకు ప్రార్థించడం అతనెన్నడూ చూడని విషయం. ఇది అతనికి దివ్యానుభూతి కలిగించగా అతను ప్రశంసాపూర్వకంగా, "నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే" అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు (మార్కు 15:39).

యేసు సిలువమీద వ్యక్తీకరించిన కృపాకటాక్షాలు పాపక్షమాపణవంటివాటిని యాకోబు కుమారులెప్పుడూ తమ కళ్లతో చూడలేదు. వారికి తెలిసినదంతా, అన్యప్రపంచంలోని ద్వేషపూరిత ప్రతీకార చర్యలు మరియు ప్రతిదాడులు. కాబట్టి, వారు శరీరకార్యాలైన "మత్సరము నరహత్య కలహము కపటము వైరమనువాటితో నిండినవారై" (రోమా. 1:29), షెకెము పట్టణంలోని మగవారినందరినీ మూకుమ్మడిగా హత్యచేసి వారి ఆస్తుల్ని పశువుల మందల్ని దోచుకున్నారు.

---

సూచనలు

[1]అంటే, యాకోబు రాహేలుపట్ల చూపిన ప్రేమ కంటె లేయాపట్ల తక్కువ ప్రేమ చూపించాడని అర్థం (29:30-32). [2]యాకోబు పండ్రెండవ కుమారుడైన బెన్యామీను అప్పటికి జన్మించలేదు (35:16-18). [3]సాహిత్య విశ్లేషణ మరియు కొంత ఊహ మేరకు, ఈ సంఘటన జరిగిన సమయం నాటికి దీనా వయసు సుమారు పదిహేను సంవత్సరాలుండవచ్చని Bruce K. Waltke అంచనా వేశారు. (Bruce K. Waltke, *Genesis: A Commentary* [Grand Rapids, Mich.: Zondervan Publishers, 2001], 459.) [4]*ra'ah* అనే పదం ఇదే విధంగా వాడబడిన నిర్గమ 2:11 వచనం చూడండి. [5]బహుశా ఈ పట్టణం నైసర్గికంగా గెరిజీము పర్వతానికి ఏబాలు కొండకు మధ్య ఉండడాన్నిబట్టి దానికి "భుజం" అనే అర్థాన్నిచ్చే "షెకెము" అనే పేరును పెట్టి ఉండవచ్చు. [6]Leonard J. Coppes, "עָנָה," in *TWOT,* 2:682. [7]*'Anah* అనే పదం కొన్ని వాక్యభాగాల్లో లైంగిక సంబంధాల్లో అనైతికతను (అవమానకరమైన చర్యలు) మామూలుగా సూచిస్తున్నప్పటికీ, మరి కొన్ని వాక్యభాగాల్లో స్పష్టంగా బలాత్కారాన్నే (లైంగిక దాడిని) సూచిస్తుంది (ద్వితీ. 22:28, 29; న్యాయాధి. 19:24; 20:5; 2 సమూ. 13:12, 14, 22, 32; విలాప. 5:11). [8]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing

Co., 1979), 365. [9]"పొందు" అనే అర్థాన్నిచ్చే పదం, "పట్టుకొను" లేక "తీసుకొను" (34:2) అనే అర్థాన్నిచ్చే పదం *laqach అనే పదం నుండే వస్తాయి* (NRSV). విధిపైచిత్రి ఏమిటంటే, షెకెము అప్పటికే దీనాను "పట్టుకొని"నట్టు తెలుస్తోంది. [10]ప్రాచీన పశ్చిమాసియా కాలంనాటి న్యాయగ్రంథాల్లో ఇటువంటి చట్టాలే కనడతాయి. ఉదాహరణకు, చూడండి Theophile J. Meek, trans., "The Middle Assyrian Laws," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d ed., ed. James B. Pritchard (Princeton, N.J.: Princeton University Press, 1969), 185 (nos. A.55, 56).

[11]ఇందుకు విరుద్ధంగా, యోసేపు మరణించాడని యాకోబు వినినప్పుడు, అతను "తన బట్టలు చింపుకొని", "తన నడుమున గోనెపట్ట కట్టుకొని", "అనేక దినములు తన కుమారునికొరకు", "అతని కోసము ఏడ్చెను" అని ఉంది (37:34, 35). [12] H. C. Leupold, *Exposition of Genesis*, vol. 2 (N.p.: Wartburg Press, 1942; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1953), 901. [13]యాకోబు అప్పటికే పట్టణం వెలుపల కొంత భూమిని కొన్నాడు (33:19), అయితే షెకెమీయులతో పెళ్లి సంబంధం అతనికి అతని కుమారులకు భూమి యాజమాన్యం విషయంలో అదనపు అవకాశాలనిస్తుంది. [14]*Mohar అనే పదం మరో రెండు వాక్యభాగాల్లో కనబడుతుంది* (*నిర్గమ.* 22:16; 1 *సమూ.* 18:25). ESV బైబిల్ ఈ పదాన్ని "bride price" (ఓలి లేక కన్యాశుల్కం) ఒకే విధమైన అనువాదం కనబడు తుంది. [15]*Mohar* మరియు *maththan అనే రెండు పదాలు ఒకే బహుమతిని రెండు వేర్వేరు పదాలతో సూచించే* "hendiadys" *అనే భాషాలంకారం*. (E. A. Speiser, *Genesis*, The Anchor Bible, vol. 1 [Garden City, N.Y.: Doubleday & Co., 1964], 265.) రెండు వేర్వేరు బహుమతుల్ని కూడా ఇచ్చి ఉండవచ్చు. అబ్రాహాము సేవకుడు రిబ్కాకు ఆమె సహోదరుడికి ఆమె తల్లికి అనేక బహుమతులిచ్చాడు (24:53). [16]Gordon J. Wenham, *Genesis 16—50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), 314. [17]Speiser, 265. [18]"Targum of Onkelos," in *The Targums of Onkelos and Jonathan ben Uzziel on the Pentateuch*, trans. J. W. Etheridge (New York: KTAV Publishing House, 1968), 113. [19]ఒక వేళ దీనా షెకెము ఇంట్లో బందీగా ఉన్నట్లయితే, అది యాకోబు కుమారులు "కపటముగా" (34:13) మరియు హింసాత్మకంగా (34:25, 26) ప్రవర్తించడానికి కారణమవుతుంది. వీరి సంఖ్య కంటె, పట్టణంలోని పురుషుల సంఖ్య అధికం కాబట్టి , బహుశా వీరు తమ సహోదరిని తమతో తీసుకొని వెళ్లడానికి కపటం (వంచన) ఒకటే మార్గమని నమ్మి ఉండవచ్చు. [20]Kenneth A. Mathews, *Genesis 11:27—50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 609.

[21]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 18—50*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 371. [22]See *The Code of Hammurabi* 196, 200.